క్లుప్తంగా

మెడోస్‌లో 2 నుంచి టెన్నిస్ టోర్నమెంట్

తగరపువలస: చిట్టివలస మెడోస్ స్పోర్ట్స్ విలేజ్‌లో డిసెంబర్ 2, 3న క్యూ 1 హాస్పిటల్స్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. అండర్ – 10, 12, 14, 16 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు డిసెంబరు 1న మధ్యాహ్నం 2 గంటల లోగా పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు పీవీ లక్ష్మిని 94407 14190లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి శ్రీరమా సత్యనారాయణకు పూజలు



కొండపై రమాసత్యనారాయణ స్వామి విగ్రహాలు

తగరపువలస: కార్తీకమాస శుద్ధ ఏకాదశి ఘడియలు బుధవారం రాత్రి 11 గంటలకు ప్రవేశించడంతో అప్పటి నుంచి స్థానిక కొండపై గల శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం రాత్రి 9 వరకు అమ్మవారు, స్వామి వారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించనున్నారు. గురువారం వేకువజాము నుంచి ఇదే కొండపై ఆలయ మండపం, ఆవరణలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిపించనున్నట్టు అర్చకులు తెలిపారు. అన్నవరం సత్యదేవుని ఆలయానికి వెళ్లలేని వారు తగరపువలసలోని ఈ కొండపైకి వస్తుంటారు. ఇక్కడ పూజలు, వ్రతాల నిర్వహణకు భక్తులకు ఏర్పాట్లు చేశారు. వ్రతాలు చేసుకోవాలనుకునే వారు 96033 23403, 63090 96836లో సంప్రదించాలని ప్రధాన అర్చకుడు ఏడిద వివేకానందశర్మ కోరారు.

200 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం మిందివానిపాలెంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ చైతన్య వైద్య సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు లెంక రాంబాబు, హరగోపాల్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ముగ్గురి ఎంపిక

ఆనందపురం : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని తపాలాశాఖ అందించే దీన్ దయాళ్ స్పార్ష్ యోజన స్కాలర్‌షిప్‌కు ఆనందపురానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. అక్టోబర్ 8న నగరంలో నిర్వహించిన పరీక్షలో భారతి విద్యానికేతన్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కొట్యాడ దీపిక, కలగ వరుణ్ అవినాష్, గంట్రేటి సురేంద్రనాయుడు ఎంపికయ్యారు. జిల్లా నుంచి నలుగురు ఎంపిక కాగా ముగ్గురు ఆనందపురం నుంచి ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల డైరెక్టర్ దొంతల రామారావు, ప్రిన్సిపాల్ ఎద్దు కృష్ణారావు విద్యార్థులను అభినందించారు.

'జగనన్నకు చెబుదాం' నేడు

పద్మనాభం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పాల్గొంటారని, ఎవరైనా వినతులు ఇవ్వదలచుకుంటే రావాలని ఆయన సూచించారు.

24న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టీమ్ లీజ్, శరణ్ మోటార్స్, మెడ్ ప్లస్, ఫ్లిప్ కార్ట్, ఆడెక్కో, లాస్య ఇంజినీరింగ్ సొల్యూషన్స్, ఎస్‌వీవీ ఇన్ఫోటెక్, వీల్స్ మార్ట్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 775 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. జూనియర్ కెమిస్ట్, ఆఫీసర్, రిటైల్ ట్రెనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రెనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, టెలికాలర్, రికవరీ, క్లర్కు, బ్రాంచి ఇన్‌చార్జి, ఎగ్జిక్యూటివ్స్, సీఆర్ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు రావాలని కోరారు.

ప్రగతి మార్గం

నాడు అస్తవ్యస్త రోడ్లు... నేడు సుందర రహదారులు

- కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న ప్రజా ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సమాజ ప్రగతికి, ఆధునికతకు రహదారులే కీలకం... అటువంటి రోడ్ల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. గతంలో టీడీపీ పాలనలో గతుకులమయమై **అస్తవ్యస్తంగా** మారిన మార్గాలు ప్రస్తుతం సుందరంగా మారి రాకపో**కలకు వీలుగా** మారాయి. ముఖ్యంగా "గడప గడపకూ మన ప్రభుత్వం" **కార్యక్రమం** నిర్వహించినప్పుడు గుర్తించిన పాడైన రోడ్లకు మరమ్మ**తులు, పునర్నిర్మా**ణానికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. జీవీఎంసీ 5, 6**, 7, 8 వార్డుల్లోని** 54 సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు రూ.10.8 కోట్లు కేటాయించి... అందులో నుంచి సింహభాగం రోడ్ల నిర్మాణానికే వెచ్చించారంటే పాలకుల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. బక్కన్నపాలెం గ్రామంలో మెయిన్ రోడ్డు, జాతీయ రహదారి నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డు వరకు, పీఎంపాలెం సాంకేతిక కళాశాల నుంచి విజేత సూపర్ మార్కెట్ వరకు, కారుషెడ్ కూడలి నుంచి పిలకవానిపాలెం వరకు ప్రధాన రహదారులు సుందరంగా నిర్మించారు. ఇంద్రానగర్, వుడా కాలనీ, ఆర్‌జీకే కాలనీ, మానం ఆంజనేయులు నగర్, తదితర కాలనీల్లో జీటీ, సీసీ రోడ్లు నిర్మించడంతో ఎన్నో ఏళ్ల నాటి కల నేరవేరిందంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - మధురవాడ



దశాబ్దాల నిరీక్షణ తర్వాత ఇటీవల నిర్మించిన పిలకవానిపాలెం రోడ్డు



నాడు : పీఎం పాలెం సాంకేతిక కళాశాల - విజేత సూపర్ మార్కెట్ రోడ్డు దుస్థితి



నేడు : రూ.2 కోట్లతో నిర్మించిన పీఎం పాలెం సాంకేతిక కళాశాల రోడ్డు





నాడు : గతంలో జాతీయ రహదారి నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డు రోడ్డు



నేడు : రూ.40 లక్షలతో కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు ఇటీవల నిర్మించిన రోడ్డు



నాడు : గతంలో వర్షం కురిసనప్పుడు బక్కన్నపాలెం మెయిన్ రోడ్డు దుస్థితి



నేడు : రూ.1.72 కోట్లతో సుందరంగా నిర్మించిన బక్కన్నపాలెం మెయిన్‌రోడ్డు

ఎన్నో ఏళ్ల ఇబ్బందులు తప్పాయి



మాది పెద్ద పేరున్న ఊరే అయినప్పటికీ **చాలా** సంవత్సరాలుగా ఇరుకు, **పాడైపోయిన** మెయిన్ **రోడ్డుతో తీవ్ర** ఇబ్బందులు పడ్డాం. చిన్నపాటి వర్షం కురిసినా చెరువులా మారిపోయేది. పూర్తిగా గోతులమయమై దుమ్ము, ధూళి ఎగరడంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడేవారిమి. జగన్ బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మా ప్రాంతంలో రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బంది తప్పింది. చాలా ఆనందంగా ఉన్నాం.

– వాండ్రాసి వరలక్ష్మి, బక్కన్నపాలెం

ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు చాలా చోట్ల మెరుగుపరిచారు. గతంలో ఎక్కడ చూసినా ప్రచార ఆర్భాటమే తప్ప చేసిన పని తక్కువ. ఇప్పుడు సంక్షేమ పథకాలతోపాటు రోడ్లు, కాల్వలు, పార్కుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఐటీ సెజ్, డంపింగ్ యార్డు, బక్కన్నపాలెంతోపాటు ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన కాలనీలకు రోడ్లు, కాలువలు నిర్మించారు. ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

– తెలిదేవర రామారావు, రేవళ్లపాలెం

వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు

- చంద్రబాబు, పవన్‌కు ప్రజలే బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఎగతాళి చేసిన చంద్రబాబు, పవన్‌కు ప్రజలంతా బుద్ధి చెప్పి ఇంటికి పంపాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, భీమిలి మండలంలోని మూలకుద్దు పంచాయతీల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలు, 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో వాటిని ఎవరు నెరవేర్చారు? ఎవరు నెరవేర్చలేదో? తేడా తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం పైనా, ముఖ్యమంత్రి జగన్‌పైనా బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్న వారికి బుద్ధి చెప్పాలని కోరారు. చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలకు రోజుల తరబడి క్యూ కట్టడం, మండల, జిల్లా కేంద్రాల్లో అధికారుల చుట్టూ చక్కర్లు కొట్టడం జరిగేదన్నారు. గత నాలుగున్నరేళ్లుగా వివక్షకు తావు లేకుండా, ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాము నాయుడు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, నాయకులు జీవీ రమణ, దుంప సాయి రెడ్డి, పందిరి విజయ్, జి.సృజన, అక్కరమాని చిన బాబు, నీలాపు రామిరెడ్డి, రొక్కం శ్రీను, వెంపాడ రమణ, గిడుతూరి వెంకటరావు, కొప్పలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కొత్త మూలకుద్దులో జరిగిన కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఇన్‌చార్జి సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డి, కొల్లి కోటిరెడ్డి, కె.ఎ.ఎస్.ఎన్.రెడ్డి, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సంతపేట సచివాలయంలో పథకాల ఫ్లెక్సీ వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

సీఎం జగన్‌తోనే పేదలకు మేలు

ఆనందపురం : రాష్ట్రంలోని పేదలకు మేలు జరగాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డే సీఎం కావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం మండలంలోని కుసులువాడలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంక సత్యం మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారుల ఇంటికే చేరవేయడం స్వాతంత్ర్య భారతదేశంలో ఎప్పుడూ జరగలేదన్నారు. నవరత్నాల పథకాలతో బడుగు బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని, మనందరి భవిష్యత్ బాగుండాలంటే మరలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేసి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు తోమురోతు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు లెంక రాంబాబు, రౌతు వెంకటరావు, చందక అప్పలస్వామి, బలిరెడ్డి మహేష్, కోరాడ అప్పలస్వామి నాయుడు, కోరాడ వెంకట రమణారావు, రౌతు శ్రీను, షిణగం రాంబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కుసులువాడలో పథకాల ఫ్లెక్సీ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు

అనుసంధాన రోడ్ల పరిశీలన

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు నుంచి మారికవలస జాతీయ రహదారి వరకు ఉన్న అంతర్గత అనుసంధాన రోడ్లను జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ మంగళవారం పరిశీలించారు. ఈ మార్గాల్లో వాహనాల రాకపోకలకు, ప్రజలు సంచరించడానికి అంతరాయం లేకుండా రోడ్లు అభివృద్ధి చేసే ప్రతిపాదనలో భాగంగా రాజీవ్‌నగర్, గొల్లల ఎండాడ, ఎండాడ, రుషికొండ, స్వర్ణభారతి నగర్, ఐటీ సెజ్, విజ్ఞాన్ కాలేజీ రోడ్డు, బావికొండ, మిథిలాపూరి వూడాకాలనీ రోడ్డు పరిశీలించారు. పర్యటనలో గొల్లల ఎండాడ రాజీవ్‌నగర్ వద్ద వ్యర్థాలు అధికంగా ఉండడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. మరలా ఇలా రోడ్లపై చెత్త కనిపిస్తే పారిశుధ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ పి.రవికృష్ణ రాజు, వీఎంఆర్‌డీఏ పర్యవేక్షక ఇంజినీరు బలరామరాజు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎండాడలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



కూరగాయలతో అలంకరించిన సంతపేట కొత్తమ్మతల్లి



పువ్వులతో అలంకరించిన మజ్జివలస రాస పోలమాంబ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం 20 రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో బీసపు సూరిబాబు, రాము దంపతుల ఆర్థిక సాయంతో భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు ఈ అలంకరణ చేశారు. అలాగే మజ్జివలస పంచాయతీ గ్రామ దేవత రాస పోలమాంబను పూలదండలతో అలంకరించారు. ఈ అలంకరణకు పిన్నింటి కృష్ణ, శ్రీను, కాగితాల అప్పారావు, నరసింహులు సహకారం అందించారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

మధురవాడ: భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలను పురస్కరించుకుని భక్తులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్రికెట్ స్టేడియం ఎదురుగా గల మధురవాడ ఎమ్‌వీవీ సిటీ సత్యసాయి సెంటర్‌లో ఏవీ రామకృష్ణ ఆధ్వర్యంలో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి మంగళవారం భోజనం, దుస్తులు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మధురవాడ ఏరియా కన్వీనర్ ప్రభాకర్, సంస్థ ప్రతినిధులు టంకాల శివాజీ, రామినాయుడు, జ్యోతి, నాగవేణి, వాగ్దేవి, శ్రీదేవి, ఎమ్‌వీవీ సిటీ అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే వుడా కాలనీ, పీఎం పాలెం తదితర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ పారిశుద్ధ్య, ఇతర కార్మికులు మధురవాడ ఏరియా కన్వీనర్ ప్రభాకర్ చీరలు, దుప్పట్లు, బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.



పారిశుధ్య కార్మికులకు సరకులు అందజేస్తున్న ప్రభాకరరావు తదితరులు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



తిరుపతిరావు (ఫైల్)

పీఎం పాలెం : పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద రీతిలో ఓ వ్యక్తి మరణించాడు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారిపై పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఓ వ్యక్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడు శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లి గ్రామానికి చెందిన ఎం.తిరుపతిరావు (51)గా పోలీసులు గుర్తించారు. మృతునికి భార్య, వివాహమైన ఇద్దరు పిల్లలున్నారు. ఉపాధి కోసం 20 సంవత్సరాల కిందట నగరానికి వలసవచ్చిన ఆయన 8 ఏళ్లుగా మారికవలస దరి రాజీవ్ గృహకల్ప కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నారు. ప్రస్తుతం గాజువాక ఆటోనగర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన ఆయన క్రికెట్ స్టేడియం సమీపంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రహదారి పక్కన తలకు తీవ్రమైన గాయంతో పడి ఉన్నాడు. గమనించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108 వాహనంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడా...? మరో కారణం ఏదైనా ఉందా..? అనే అంశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి



నరసాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకుని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. పద్మనాభం మండలం తునివలస పంచాయతీ నరసాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఏదైనా కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. డ్రైనేజీ సమస్య తీర్చడంతోపాటు ల్యాండ్ పూలింగ్‌లో ప్రభుత్వానికి భూములిచ్చిన రైతులకు పరిహారంగా కేటాయించిన స్థలాలను వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని కోరారు. టీడీపీ హయాంలో కంటే వైఎస్సార్‌సీపీ పాలనలోనే తమకు సంక్షేమ పథకాలు అందినట్టు పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకర పైడిరాజు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆర్.సూర్యనారాయణ, సుంకర బంగారప్పుడు, ఈర్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొమ్మాది: గిరిజనుల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సీఈఎస్ఎస్ ప్రొఫెసర్ గోపీనాథ్ రెడ్డి అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ దివస్ – గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా మిషన్ భవన్‌లో ఆయన ప్రసంగించారు. గిరిజన ఉప ప్రణాళికకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని, ఐటీడీఏ పరిధిలోని అధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ డైరెక్టర్ ఈసా రవీంద్రబాబు, ఈడీ చినబాబు, మిషన్ సిబ్బంది టి.వెంకటేశ్వరరావు, శంకరరావు, సీహెచ్ శ్రీనివాస్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణతో ఆర్థిక భరోసా

ఆనందపురం : పశు పోషణ చేపట్టిన రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పశు సంవర్ధక శాఖ డీడీ ఎన్.కరుణాకర రావు అన్నారు. మండలంలోని తర్లువాడలో మంగళవారం పశు సంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పశు కృత్రిమ గర్భధారణ, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర రావు మాట్లాడుతూ లేగ దూడలుగా ఉన్న సమయంలో మంచిగా సంరక్షిస్తే ఆవులుగా, గేదెలుగా రూపాంతరం చెందిన తర్వాత అధిక పాల ఉత్పత్తిని సాధించవచ్చని చెప్పారు. లేగ దూడల పోషణలో మెలకువలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పశు పోషణపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, డీఎల్‌డీఏ ఈవో రామ్మోహన్, మండల పశు వైద్యులు ఎల్.కన్నమనాయుడు, ఎస్.లీలారాణి, గోపాల మిత్ర చంద్రరావు, రైతులు పాల్గొన్నారు.



రైతుకు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ శారద ప్రియాంక, అధికారులు

శంకర రెడ్డికి ఘన నివాళి

తగరపువలస: చిట్టివలస కాంగ్రెస్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిల్ల శంకరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం చిల్లపేటలో ఆయన విగ్రహానికి కార్మిక సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్ రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, నీలాపు శంకరరెడ్డి, చిల్ల ఆదినారాయణరెడ్డి, చిల్ల కాశీ విశ్వనాథరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, తమ్మిన కూర్మారావు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీలచే కార్తీక దీపోత్సవం

తగరపువలస: ప్రజాపిత బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో బంగ్లామెట్ట వద్ద మంగళవారం నిర్వహించిన పూజల్లో పలువురు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, లక్ష దీపోత్సవం నిర్వహించారు. బ్రహ్మకుమారీలు వేణు, నిర్మల, సంధ్య, పార్వతి, సునీత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బంగ్లామెట్ట వద్ద దీపోత్సవంలో బ్రహ్మకుమారీలు